సాక్షి జనగామ

శనివారం । 10 । ఫిబ్రవరి । 2024



భక్తుల భద్రతే ధ్యేయం..

మేడారం మహాజాతరలో భక్తుల భద్రతే ధ్యేయంగా ఏర్పాట్లు చేపడుతున్నామని మల్టీజోన్ ఐజీ తరుణ్ జోషి అన్నారు. జాతరలో ట్రాఫిక్ నిర్వహణ చాలెంజింగ్‌గా ఉంటుందన్నారు. - 8లో▸



నకిలీ సర్టిఫికెట్ల తయారీ ముఠా అరెస్టు

వరంగల్ కమిషనరేట్ పరిధిలోని ఆర్‌టీఓ కార్యాలయాల ఎదుట పాపులు ఏర్పాటు చేసుకుని నకిలీ సర్టిఫికెట్లు తయారు చేస్తున్న ముఠాను అరెస్టు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. - 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 33⁰ /20⁰

జిల్లాలో ఉదయం చల్లని వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం సమయంలో సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. రాత్రి పూట చలి తీవ్రత కొంత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

చిల్పూరు ఆలయంలో శ్రవణ నక్షత్ర హోమం

చిల్పూరు: చిల్పూరు శ్రీ బుగులు వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం శ్రవణ నక్షత్రాన్ని పురస్కరించుకుని అభిషేకం, హోమం, స్వామి వారి కల్యాణం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు హైదరాబాద్‌కు చెందిన కోదండ బాబురావు-పద్మావతి దంపతులు అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. ఆలయ ఈఓ లక్ష్మీప్రసన్న పర్యవేక్షించగా.. అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు కబడ్డీ జట్టు ఎంపికలు

జనగామ: పట్టణంలో ధర్మకంచ మినీ స్టేడియంలో ఈనెల 11న జిల్లా స్థాయి బాల బాలికల సబ్ జూనియర్ కబడ్డీ జట్టు ఎంపికలు ఉంటాయని నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా జట్టుకు ఎంపికైన వారు ఈనెల 16 నుంచి సూర్యాపేటలో జరిగే 33వ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని, 55 కేజీల లోపు బరువు, 2009 మార్చి 20, ఆ తర్వాత జన్మించిన వారు అర్హులని పేర్కొన్నారు. ఎంపిక సమయంలో క్రీడాకారులు ఆధార్ కార్డును వెంటతెచ్చుకోవాలని, మరిన్ని వివరాలకు 94416 36095, 89190 73358, 9010255898 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

హెచ్‌ఐవీ ట్రీట్‌మెంట్‌పై అవగాహన కల్పించాలి



జనగామ: జిల్లా పరిధిలో హెచ్‌ఐవీ పరీక్షలు, ఏఆర్‌టీ మందులు, ట్రీట్‌మెట్ తదితరాలపై అవగాహన కల్పించాలని ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ప్రాజెక్టు డైరెక్టర్(ఐఏఎస్) కె.హైమావతి అన్నారు. జిల్లా ప్రభుత్వ వైద్య కళాశాలలోని హెచ్‌ఐవీ విభాగాలను ఆమె శుక్రవారం సందర్శించారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలు చేస్తున్న ఎన్‌ఏసీ-5వ(జాతీయ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ) దశలో హెచ్‌ఐవీ రోగులకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. ఆమె వెంట జాయింట్ డైరెక్టర్ కరుణశ్రీ, ఇందిరా ప్రియదర్శిని, ఆంథోనీరెడ్డి, వైద్యులు సెలీనా, వైష్ణవి, ఐసీటీసీ కౌన్సిలర్ వేముల సతీష్‌కుమార్, నరేందర్ తదితరులు ఉన్నారు.

రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు రాహుల్



నర్మెట: స్థానిక మోడల్ కళాశాలలో ఇంటర్ సెకండియర్ చదువుతున్న కుందారపు రాహుల్ రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ టి.శరత్‌కుమార్ తెలిపారు. ఇటీవల జిల్లా కేంద్రంలో నిర్వహించిన పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన రాహుల్ ఈనెల 10, 11న ధర్మసాగర్‌లో నిర్వహించే రాష్ట్ర పోటీల్లో పాల్గొంటారని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

24 నుంచి టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు పరీక్షలు

జనగామ రూరల్: టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సులకు గాను జిల్లా వ్యాప్తంగా పరీక్షలు ఈనెల 24 నుంచి 27 వరకు నిర్వహిస్తున్నట్లు డీఈఓ రాము ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలకు హాజరయ్యే వారికి త్వరలో హాల్ టికెట్లు తీసుకునే తేదీని బోర్డు తెలియజేస్తుందని పేర్కొన్నారు. డ్రాయింగ్‌లో అప్పర్ లోయర్, ఎంబ్రాయిడరీ, టైలరింగ్‌లో అప్పర్ లోయర్ పరీక్షలు ఉంటాయని వివరించారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షల ఫీజు చెల్లించాలి

విద్యారణ్యపురి: ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ విద్యార్థులు పరీక్ష ఫీజులు చెల్లించాలని హనుమకొండ జిల్లా డీఈఓ అబ్దుల్ హై, ఓపెన్ స్కూల్ ఉమ్మడి వరంగల్ జిల్లా కో-ఆర్డినేటర్ మురాల శంకర్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అపరాధ రుసుము లేకుండా ఈనెల 12 నుంచి 21వ తేదీ వరకు మీసేవ/టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల్లో ఫీజు చెల్లించాలని వివరించారు. ఈనెల 22 నుంచి 27వ తేదీ వరకు రూ.25 అపరాధ రుసుముతో, ఈనెల 28 నుంచి మార్చి 4 వరకు రూ.50 అపరాధ రుసుముతో పరీక్ష ఫీజు చెల్లించవచ్చని వారు పేర్కొన్నారు.

నర్సంపేట రూరల్ : లక్నెపల్లిలో పీవీ నరసింహారావు స్మారక మందిరం, పీవీ విగ్రహానికి పూలమాల వేస్తున్న మాజీ సర్పంచ్, ట్రస్ట్ బాధ్యులు





మన రత్నం



ఓరుగల్లు బిడ్డ పీవీకి భారత అత్యున్నత పురస్కారంపై సర్వత్రాహర్షం

- వంగర నుంచి ప్రధాని వరకు ఎదిగిన 'పాములపర్తి'
- మన లీవీకి సరైన గుర్తింపు లభించిందంటున్న ఓరుగల్లు వాసులు
- మరోసారి పీవీ సేవలను గుర్తు చేసుకుంటున్న ప్రజలు
- నీరాజనాలు పలుకుతున్న వంగర, లక్నెపల్లి గ్రామస్తులు

సాక్షిప్రతినిధి, వరంగల్/ఎల్కతుర్తి/నర్సంపేట రూరల్: మన పీవీ..లీవీకి భారత అత్యున్నత పురస్కారం లభించింది. బహుముఖ ప్రజ్ఞాశాలి, బహుభాషాకోవిదుడు, భారత మాజీ ప్రధాని, దివంగత పీవీ నర్సింహారావుకు భారతరత్న దక్కింది. అత్యంత ప్రతిష్టాత్మకమైన పౌర పురస్కారంతో ఓరుగల్లు ఖ్యాతి మరోసారి ఖండాంతరాలు దాటింది. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగరకు చెందిన పీవీ నర్సింహారావు రాష్ట్ర, దేశ రాజకీయాల్లో తనదంటూ ప్రత్యేకతను చాటారు. దేశ రాజకీయాల్లో కీలకంగా వ్యవహరించిన వంగర ముద్దుబిడ్డను భారతరత్న వరించడం పట్ల సంబరాలు అంబరాన్నంటుతున్నాయి. యావత్తు ప్రజానీకం నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. తెలంగాణ ఖ్యాతిని ఖండాంతరాలకు చాటిన మహా మేధావి, మౌనమునిగా పేరుగాంచిన పీవీకి ఇప్పటికే ఇక్కడి ప్రభుత్వాలు సముచిత గౌరవాన్నిచ్చాయి. ఆయన జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహిస్తున్నాయి. ఇప్పుడు కేంద్రం అత్యున్నత పురస్కారం భారతరత్నను ప్రకటించడం పట్ల వంగర ప్రజలు మురిసిపోతున్నారు.

లక్నెపల్లి నుంచి వంగరకు పీవీ.. నాగపూర్‌లో ఎల్ఎల్‌బీ..

పీవీ స్వగ్రామం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర కాగా, ఆయన తన అమ్మమ్మగారి ఊరైన వరంగల్ జిల్లా నర్సంపేట మండలం లక్నెపల్లిలో 1921, జూన్ 28న జన్మించారు. పీవీ తల్లిదండ్రులు సీతారామారావు, రుక్మాబాయమ్మ (రుక్మిణి)లు కాగా పూర్వ కరీంనగర్ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర గ్రామానికి చెందిన పాములపర్తి రంగారావుకి సంతానం లేకపోవడంతో పీవీని దత్తత తీసుకున్నారు. వేలేరు మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యాభ్యాసం మొదలు పెట్టిన ఆయన, హనుమకొండలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మెట్రిక్యులేషన్ పూర్తిచేశారు. కళాశాల చదువుకోసం ఉస్మానియా విశ్వవిద్యాలయంలో చేరారు. అక్కడ వందేమాతరం ఆలపించడంతో సహచరులతోపాటు పీవీని విశ్వవిద్యాలయం నుంచి అప్పటి నిజాం ప్రభుత్వం బహిష్కరించింది.

విద్యార్థి దశనుంచే నిజాం వ్యతిరేక పోరాటం

నిజాం ఏలుబడిలోని ఏ ప్రాంతంలోనూ చదివేందుకు వీలు లేదని అప్పటి ప్రభుత్వం నిషేధం విధించింది. దీంతో మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో ఉన్నత విద్యాభ్యాసం కొనసాగించారు. బీఎస్సీ, ఎల్ఎల్‌బీ పూర్తిచేశారు. విద్యార్థి దశనుంచే నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేశారు. కొంతకాలం అజ్ఞాతవాసంలో ఉండి చాందా క్యాంపులో క్రియాశీలకపాత్ర పోషించారు. హైదరాబాద్ రాష్ట్ర మొదటి ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు వద్ద జూనియర్ న్యాయవాద వృత్తిని ప్రారంభించారు. అనంతరం ఊహించని పరిణామాలు చోటుచేసుకోవడంతో కాంగ్రెస్‌లో చేరారు. అంచెలంచెలుగా ఎదిగి అఖిలభారత కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడయ్యారు. ఇదిలా ఉండగా పీవీకి పదేళ్ల వయసులో సత్యమ్మతో వివాహమైంది. వారికి ముగ్గురు కుమారులు, ఐదుగురు కుమార్తెలు.



వంగరలో పీవీ నరసింహారావు ఇల్లు

వంగరలో మిన్నంటిన సంబురాలు

పీవీ స్వగ్రామం వంగర గ్రామంలో సంబురాలు మిన్నంటాయి. పీవీకి భారతరత్న ప్రకటించడం పట్ల పార్టీలకతీతంగా పీవీ అభిమానులు, వివిధ పార్టీల నాయకులు, వంగర ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. వంగర గ్రామంలో పీవీ ఇంటి ఎదుట ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. టపాసులు పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు. విద్యార్థులతో కలిసి వీధుల్లో ర్యాలీ నిర్వహించారు.

వరంగల్ గడ్డమీద జర్నలిస్టుగా..

పీవీ తన సన్నిహితుడు పాములపర్తి సదాశివరావుతో కలిసి 1944లో కాకతీయ పత్రికను వరంగల్ జిల్లాలో స్థాపించారు. 1946-1955 వరకు వారపత్రికను కొనసాగించారు. ఇందులో గొల్లరామవ్వకథ, నీలిరంగు పట్టుచీర, మంగయ్యజీవితం లాంటి రచనలు అప్పటి సామాజిక జీవనానికి అద్దంపట్టాయి. పీవీ రచించిన ఆర్తగీతికలు కాకతీయ పత్రికలో ప్రచురితమయ్యాయి. పీవీ రాసిన తన ఆత్మకథ 'లోపలిమనిషి'లో భారతదేశ చరిత్ర, హైదరాబాద్ సంస్థానంలోని విశిష్టమైన అంశాలు, జరిగిన పరిణామాల గురించి వివరించారు. కాగా సాహితీసంపన్నుడు పీవీకి 17భాషల్లో ప్రావీణ్యం ఉంది. మరాఠీ నవలలను తెలుగులోకి, తెలుగు గ్రంథాలను హిందీలోకి అనువాదం చేశారు. కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ రచించిన 'వేయిపడగలు'ను 'సహస్రఫణ్' పేరుతో హిందీలోకి అనువాదం చేశారు. హరినారాయణ్ ఆప్టే మరాఠీ ప్రసిద్ధ నవల 'పాన్‌లక్షత్ కోన్‌ఘెటొ'ను పీవీ 'అబలజీవితం' పేరుతో తెలుగులో అనువదించారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా 1972 ఆగస్టు 15న శాసనసభలో 'ఆ నిద్రాణ నిశీధిని మానిసి మేల్కొల్పినాడు' అని తన సందేశాన్ని కవితాగానం చేశారు.

క్లిష్టపరిస్థితుల్లో ప్రధానిగా వంగర బిడ్డ..

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా, భారత ప్రధానిగా క్లిష్టసమయాల్లో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ముల్కీ నిబంధనలు చట్టవిరుద్ధమని చెప్పిన సుప్రీంకోర్టు తీర్పును బహిరంగంగా స్వాగతించినందుకు అప్పటి సీమాంధ్రనేతలు ఆయనపై కక్షగట్టారు. భూసంస్కరణల చట్టం అమలుకు ఏకంగా ఆర్డినెన్స్ తేవడం తెలంగాణ-ఆంధ్రానేతలకు కంఠగింపుగా మారింది. ఫలితంగా పీవీ ముఖ్యమంత్రి పదవీచ్యుతుడయ్యారు. తదనంతర పరిణామాలతో కేంద్రంలో ముఖ్యనేతగా ఎదిగారు. ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన భారతదేశాన్ని భారత ప్రధానిగా తన శక్తియుక్తులతో గట్టెక్కించారు. మెజారిటీ లేని తన ప్రభుత్వాన్ని కాపాడుకునేందుకు ఎన్నో నిందలు, అవమానాలు భరించారు. 1996లో ప్రధాన మంత్రి పదవీకాలం ముగిశాక పీవీ క్రియాశీల రాజకీయాలకు దూరంగా ఉన్నారు. పీవీ 2004 సంవత్సరంలో పరమపదించారు.

పీవీ జయంతి, వర్ధంతి అధికారిక కార్యక్రమాలు

పీవీ మరణించాక అధికారంలో ఉన్న కేంద్ర, రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వాలు పీవీని పట్టించుకోలేదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక అప్పటి సీఎం కేసీఆర్ పీవీ జయంతి, వర్ధంతిని అధికారికంగా నిర్వహించేందుకు ఆదేశాలు ఇచ్చారు. పీవీ స్వగ్రామం వంగరలో పార్కు పనులను ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన చేపడుతుండగా పీవీ ఇంటిని ఆయన కుటుంబసభ్యులు మ్యూజియంగా మార్చారు. సందర్శకుల దృష్ట్యా పీవీ వాడిన వస్తువులను, ఫొటోలను ఇంట్లో భద్రపరిచారు.

ఇంతకాలానికి గౌరవం దక్కింది



పీవీకి భారతరత్న ఇవ్వాలని పదేళ్ల క్రితం వంగరలో రిలే నిరాహార దీక్షలు చేశాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విన్నవించాం. మా ఊరు బిడ్డ పీవీ నరసింహారావు అని గర్వంగా చెప్పుకునేటోళ్లం. వంగర అంటేనే పీవీ ఊరని దేశమంతా తెలిసేటట్టుగ జేసిండు. ఆయన వంగర బిడ్డ కావడం మా అదృష్టం. ఇంతకాలానికి పీవీకి సరైన గౌరవం దక్కింది.

- ఆర్.వెంకటరెడ్డి, మాజీ సర్పంచ్, వంగర

ప్రజలే పీవీ ఆస్తి



పీవీ ప్రజలే తన ఆస్తిగా భావించిండు. వంగరకు వత్తె అందరం ఆయన ఇంటికి వెళ్లేటోళ్లం. ఆయనతో ఆడుకున్న వాళ్లను, సోపతి జేసినోళ్లను పేరు పెట్టి పలకరించేటోడు. వచ్చినప్పుడల్ల అనేది మనూరుకు సర్కారు దవాఖాన కావాలని. జబ్బొచ్చినా, పాములు, తేళ్లు కుట్టినా ముల్కనూరుకు ఎడ్లకచ్చురంల తీసుకపోయేటోల్లం. అటువంటిది మా బాధ జూసి ముల్కనూరు కంటే పెద్ద సర్కారు దవాఖాన తెచ్చిండు. ఇన్నాళ్లకు మా వంగర ఊర్ల పండుగచ్చింది.

- లక్కిరెడ్డి సుగుణమ్మ వంగర గ్రామస్తురాలు

ఆనందంగా ఉంది..



బహుభాషా కోవిదుడు భారత మాజీ ప్రధానమంత్రి పీవీ నర్సింహారావు ఎన్నో ఆర్థిక సంస్కరణలు చేసి భారతదేశాన్ని గాడిలో పెట్టిన మహోన్నతమైన వ్యక్తి. ఆయన చేసిన సంస్కరణలే నేటికీ అమలవుతున్నాయి. గత పాలకులు మాత్రం పీవీ నర్సింహారావును విస్మరించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గుర్తించి పీవీ నర్సింహారావుకు భారతరత్న అందించడం చాలా ఆనందంగా ఉంది. బీజేపీ ప్రభుత్వం, ప్రధాన మంత్రి నరేంద్రమోదీకి ప్రత్యేక ధన్యవాదాలు.

- రవీంద్రశర్మ, పీవీ నరసింహారావు ట్రస్ట్ సెక్రటరీ, లక్నెపల్లి

బహుభాషకోవిధుడు..



స్వర్గీయ మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు బహుభాషకోవిధుడు.. ఏ రాష్ట్రానికి వెళ్లినా అక్కడి భాషలోనే ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్న మహోన్నత వ్యక్తి. అలాంటి మహనుభావుడు జన్మించిన స్థలం నర్సంపేట మండలం లక్నెపల్లి కావడంతో ఈ ప్రాంత ప్రజల అదృష్టం. ఆయన చేసిన సంస్కరణలు భారతదేశంలో చిరస్థాయిగా నిలిచిపోయాయి. ఆలస్యమైనప్పటికీ భారతరత్న ఇవ్వడం ఆనందంగా ఉంది. ప్రభుత్వానికి ప్రజల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు.

- గొడిశాల రాంబాబు, మాజీ సర్పంచ్, లక్నెపల్లి

ఆన్‌లైన్ డాటా ఎంట్రీలో తప్పులు చేయొద్దు

- కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య

స్టేషన్‌ఘన్‌పూర్/చిల్పూరు: 'అభయహస్తం'లో భాగంగా మహాలక్ష్మి పథకానికి ప్రజలు ఇచ్చిన దరఖాస్తుల్లో గ్యాస్ కంజ్యూమర్ నంబర్ల ఆన్‌లైన్ ప్రక్రియలో అధికారులు ఎలాంటి తప్పులు చేయకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని కలెక్టర్ శిలింగయ్య అన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్‌చ చిల్పూరు మండలం చిన్నపెండ్యాలలో నిర్వహిస్తున్న ఆన్‌లైన్ డాటా ఎంట్రీ కార్యక్రమాన్ని, సర్వేను అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్‌తో కలిసి ఆయన శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 'ఆరు గ్యారంటీ' పథకాలకు ప్రజలు ఇచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. అనంతరం ఆన్‌లైన్ కాని వారి ఇళ్లకు స్వయంగా వెళ్లి దరఖాస్తులను పరిశీలించారు. అర్జీలో తప్పులు ఉంటే వారు ఇచ్చిన మొబైల్ నంబర్ ద్వారా ఫోన్ చేసి సరైన సమాచారం తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. దరఖాస్తుల పురిశీలనలో నిర్లక్ష్యం కనిపించడంతో అధికారుల పనితీరుపై అసహనం వ్యక్తం చేశారు. కలెక్టర్ వెంట స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీఓ వాసం రామ్మూర్తి, మండల ప్రత్యేకాధికారి కొర్నేలియస్, తహసీల్దార్ సరస్వతి, ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీఓ మధుసూదన్, కార్యదర్శి శౌధర్‌రెడ్డి ఉన్నారు.



స్టేషన్‌ఘన్‌పూర్‌లో సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ శివలింగయ్య

హెచ్ఆర్‌సీ క్యాలెండర్ ఆవిష్కరణ

జనగామ రూరల్: జిల్లా కమిటీ ఎస్‌జేడబ్ల్యూ హెఆర్‌సీ క్యాలెండర్‌ను శుక్రవారం కలెక్టర్ శివలింగయ్య ఆవిష్కరించారు. కలెక్టరేట్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. పేదలకు న్యాయం అందేలా అన్నివిధాలుగా హెచ్ఆర్సీ కృషి చేస్తున్నదని చెప్పారు. అనంతరం సీఐ రఘుపతిరెడ్డి చేతుల మీదుగా తహసీల్దార్ కార్యాలయాల్లో క్యాలెండర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఎడ్ల శ్రీనివాస్, జిల్లా చైర్మన్ బి.అరుణ్‌కుమార్, వైస్ చైర్మన్ రమావత్ తిరుపతి, ఉమెన్స్ చైర్మన్ డి.నవ్య, బి.రాజు, ఎం.సురేష్, లలిత, స్వామి పాల్గొన్నారు.

ఈవీఎంల మొదటి దశ తనిఖీలు

కలెక్టరేట్‌లోని ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ గోదాంలో ఈవీఎంల మొదటి దశ తనిఖీ ప్రక్రియ కొనసాగుతోందని కలెక్టర్ శివలింగయ్య అన్నారు. శుక్రవారం ఈవీఎంల ప్రక్రియను పరిశీలించిన ఆయన మాట్లాడుతూ.. భారత ఎన్నికల సంఘం ఆదేశాలు, నిబంధనల మేరకు అన్ని రాజకీయ పార్టీల ప్రనిధుల సమక్షంలో తనిఖీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, వివిధ పార్టీల ప్రతినిధులు, ఏఓ రవీందర్ పాల్గొన్నారు.

శాస్త్రీయ విజ్ఞానంపైనే జాతి భవిష్యత్..

- ఎన్ఐఎన్ మాజీ డైరెక్టర్ శశికిరణ్
- రాష్ట్ర స్థాయి చెకుముకి పోటీలు ప్రారంభం

జనగామ రూరల్: శాస్త్రీయ విజ్ఞానంపైనే జాతి భవిష్యత్ ఆధారపడి ఉందని ఎన్ఐఎన్ మాజీ డైరెక్టర్ శశికిరణ్ అన్నారు. పట్టణంలోని ఏకశిల బీఈడీ కళాశాలలో జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు కోయ వెంకటేశ్వర్లు అధ్యక్షతన రాష్ట్ర స్థాయి చెకుముకి పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాల నుంచి 297 మంది విద్యార్థులు, గైడ్స్ పాల్గొన్నారు. ప్రారంభ సభలో శశికిరణ్ మాట్లాడుతూ.. మూఢవిశ్వాసాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయడంతోపాటు విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను జేవీవీ వెలికితీస్తుందని చెప్పారు. విద్యార్థులు లక్ష్యం ఎంచుకుని శ్రమిస్తూ ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, టీచర్లు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. డీసీపీ సీతారాం మాట్లాడుతూ జిల్లాలో రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. డీఈఓ రాము మాట్లాడుతూ.. విద్యార్థుల్లో సైన్స్ పట్ల ఆసక్తి పెంచడంతోపాటు వారిలోని నైపుణ్యాలు వెలికి తీయడానికి జేవీవీ చేపట్టే కార్యక్రమాలు భవిష్యత్‌లో ఎతంగానో ఉపయోగపడతాయన్నారు. కేంద్ర సాహిత్య అవార్డు గ్రహీత చొక్కాపు వెంకటరమణ మాట్లాడుతూ ఎప్పుడూ చదువే కాకుండా.. తల్లిదండ్రులు విద్యార్థుల అభిరుచులు తెలుసుకుని పోత్సహించాలని సూచించారు. అనంతరం పట్టణంలో రోడ్డుపై కళ్లకు గంతలు కట్టుకుని బైక్‌ను జేవీవీ నాయకుడు కుర్మయ్య నడిపించి ఆశ్చర్యపర్చారు. అంతకు ముందు మెజీషియన్ చంద్రయ్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనాథ్, బీఎస్.రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రవీందర్, ఆకుల శ్రీనివాస్, లక్ష్మణ్, బాలరాజు, శ్రీనివాస్‌చారి, మాచర్ల భిక్షపతి పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న శశికిరణ్, వేదికపై డీసీపీ, డీఈఓ తదితరులు



కళ్లకు గంతలు కట్టుకుని ద్విచక్రవాహనం నడుపుతున్న కుర్మయ్య

సమస్యల పరిష్కారమే లక్ష్యం



విశ్రాంత ఉపాధ్యాయులతో సంఘం బాధ్యులు

జనగామ రూరల్: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే పీఆర్‌టీయూ లక్ష్యమని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి అన్నారు. సంఘం ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం జిల్లా కేంద్రంలో జెండా ఆవిష్కరించి మాట్లాడారు. 52 ఏళ్ల నుంచి ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై సంఘం అలుపెరుగని పోరాటం చేస్తున్నదని, భవిష్యత్‌లోనూ ఐక్య ఉద్యమాలు నిర్వహించి సమస్యలు పరిష్కారించుకోవాలన్నారు. అనంతరం విశ్రాంత ఉపాధ్యాయులను సన్మానించారు. ఎల్లారెడ్డి, భాగ్యవతి, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

వడగళ్ల పరిహారం మంజూరు చేయాలి

- కలెక్టరేట్ వద్ద బాధిత రైతుల ధర్నా

జనగామ: గత ఏడాది మార్చి-ఏప్రిల్ నెలల్లో కురిసిన వడగళ్లతో నష్టపోయిన పంటలకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ జనగామ మండలం వడ్లకొండకు చెందిన బాధిత రైతులు శుక్రవారం కలెక్టరేట్ ఎదట ధర్నా చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు మోకు కనకారెడ్డి వారికి మద్దతు పలికిన అనంతరం రైతులతో కలిసి ఆయన మాట్లాడారు. వందలాది ఎకరాల్లో వరి, కూరగాయల తోటలు, మామిడి, ఇతర పంటలు వడగళ్లకు ధ్వంసమయ్యాయని, ఎకరాకు రూ.10వేల చొప్పున పరిహారం ఇస్తామని నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించినా నేటికీ పైసా అందలేదన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పరిహారం విషయమై స్పందించడంలేదని వాపోయారు. ప్రస్తుత యాసంగి పంటల పెట్టుబడికి డబ్బులు లేకపోవడంతో ప్రైవేటు వ్యాపారుల వద్ద వడ్డీకి తెచ్చుకోవాల్సి వస్తోందని, పరిహారం చెల్లించడంతోపాటు రూ.2లక్ష పంట రుణమాఫీ చేసి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం పట్టణ కార్యదర్శి మంగ బీరయ్య, రైతులు రామ్మోహన్ రెడ్డి, సురేందర్‌రెడ్డి, రామచక్కం సత్తయ్య, జగన్, సిద్దయ్య, రాములు, ఎండీ.యూసుఫ్ తదితరులు ఉన్నారు. అంతకు ముందు కలెక్టర్ శివలింగయ్యకు వినతిపత్రం అందజేశారు. ఎస్సై తిరుపతి బందోబస్తు ఏర్పాటు చేశారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

రాజయ్యను కాంగ్రెస్‌లో చేర్చుకోవద్దు

- గాంధీ భవన్‌ను ముట్టడించిన మహిళా కార్యకర్తలు

రఘునాథపల్లి: మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య ఎమ్మెల్యేగా ఉన్న రోజుల్లో మహిళా కార్యకర్తల మానాభిమానాలకు రక్షణ లేకుండా పోయింది.. అలాంటి వ్యక్తిని కాంగ్రెస్‌లో చేర్చుకోవద్దని నియోజకవర్గానికి చెందిన పార్టీ మహిళలు హైదరాబాద్ గాంధీ భవన్‌ను శుక్రవారం ముట్టడించారు. ఎంపీపీ మేకల వరలక్ష్మి ఆధ్వర్యంలో పలు మండలాలకు చెందిన మహిళలు తరలివెళ్లి అక్కడ బైఠాయించారు. అనంతరం టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్‌గౌడ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మహిళా నాయకురాళ్లు మాట్లాడుతూ రాజయ్య పార్టీలోకి వస్తే ఆయన అనుచరుల పెత్తనం నడుస్తుందని, మళ్లీ కాంగ్రెస్ నాయకులకు అన్యాయం జరుగుతుందన్నారు. ఎట్టి పరిస్థితిల్లో ఆయనను పార్టీలోకి రానిచ్చే పరిస్థితి లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు రంగమ్మ, విజయ, రేణ, కవిత, నాయకురాళ్లు నారబోయిన పద్మ, చింత జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.



గాంధీ భవన్ ఎదుట బైఠాయించిన కాంగ్రెస్ మహిళా నాయకులు, కార్యకర్తలు

క్లుప్తంగా

విద్యార్థులు నిబంధనలు పాటించాలి

ఏటూరునాగారం: ఏటూరునాగారం గురుకుల డిగ్రీ గిరిజన బాలికల కళాశాలలో ఈనెల 11వ తేదీన జరిగే 5వ తరగతి గురుకుల ప్రవేశ పరీక్షకు వచ్చే విద్యార్థులు నిబంధనలు పాటించాలని కళాశాల ప్రిన్సిపాల్ ఉమాదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 205 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు అవుతారన్నారు. విద్యార్థులు వాటర్ బాటిల్, పరీక్ష ప్యాడ్, బ్లాక్, బ్లూ బాల్ పెన్, ఆధార్ కార్డు, హాల్‌టికెట్ వెంట తీసుకుని ఈనెల11వ తేదీ ఉదయం 10 గంటలలోపు కళాశాలకు చేరుకోవాలన్నారు. వివరాలకు 7901097696, 9951755806, 9533781812 నంబర్లను సంప్రదించాలన్నారు.

పీటీసీ కోసం స్థల పరిశీలన

గీసుకొండ: మండలంలోని మచ్చాపూర్ సమీపంలోని అపెక్స్ ఇంజనీరింగ్ కళాశాల భవనం, మైదానాన్ని శుక్రవారం నగర పోలీస్ కమిషనర్ అంబర్‌కిశోర్‌ఝా పరిశీలించినట్లు స్థానికులు తెలిపారు. గతంలో ఈ భవనంలో ఇంజనీరింగ్ కళాశాల నిర్వహించగా, ప్రస్తుతం సోషల్ వెల్ఫేర్ బాలుర గురుకుల పాఠశాలను నిర్వహిస్తున్నారు. కళాశాల భవనంతో పాటు ముందు మైదానం ఉండడంతో పోలీస్ ట్రైనింగ్ సెంటర్ కోసం ఉపయోగపడుతుందా లేదా అని సీపీ పరిశీలించినట్లు తెలుస్తోంది. గతంలో కూడా ట్రైనింగ్ సెంటర్ కోసం అప్పటి సీపీ ఇదే కళాశాలను పరిశీలించి వెళ్లారు. అయితే తాజాగా సీపీ పర్యటనను పోలీసు అధికారులు గోప్యంగా ఉంచుతున్నారు. గీసుకొండ ఇన్‌స్పెక్టర్ బాబూలాల్ పాల్గొన్నారు.

కెనాల్‌లోకి దూసుకెళ్లిన వాహనం

● తప్పిన ప్రమాదం.. ఇద్దరు సురక్షితం


క్రేన్ సాయంతో కెనాల్‌లో పడిన వాహనాన్ని బయటకు తీస్తున్న అధికారులు

హన్మకొండ: టాటా ఏస్ వాహనం కెనాల్‌లోకి దూసుకెళ్లింది. ఈ ఘటన శుక్రవారం హసన్‌పర్తి చింతగట్టువద్ద జరిగింది. చింతగట్టు కట్టపై వాహనం రివర్స్ తీస్తుండగా అదుపుతప్పి కెనాల్‌లోకి దూసుకెళ్లింది. నీటి ప్రవాహం తీవ్రంగా ఉండడంతో వాహనం నీటిలో మునిగింది. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణాపాయం జరగలేదు. ఇందులో ప్రయాణిస్తున్న ఇద్దరు క్షేమంగా బయటపడ్డారు. కెనాల్‌లో పడిన వాహనాన్ని తీసేందుకు యత్నిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. ప్రమాదం నుంచి బయటపడిన వారి వివరాలు తెలియాల్సి ఉంది.


భక్తుల భద్రతే ధ్యేయం..

జాతరలో నేరాల కట్టడికి నిరంతరం కృషి
● 500 సీసీ కెమెరాల ఏర్పాటు
● మల్టీ జోన్ ఐజీ తరుణ్ జోషి



మాట్లాడుతున్న మల్టీ జోన్ ఐజీ తరుణ్‌జోషి

ఎస్ఎస్‌తాడ్వాయి : మేడారం మహాజాతరలో ప్రతిక్షణం భక్తుల భద్రతే ధ్యేయంగా ఏర్పాట్లు చేపడుతున్నట్లు మల్టీజోన్ ఐజీ తరుణ్‌జోషి అన్నారు. శుక్రవారం మేడారం హరిత హోటల్‌లో నోడల్ అధికారులతో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఐజీ మాట్లాడుతూ డ్యూటీ ప్రదేశంలో పాటించాల్సిన జాగ్రత్తలు వివరిస్తూ భక్తులతో ఓపికగా వ్యవహరించాలని సూచించారు. మేడారం జాతరలో ట్రాఫిక్ నిర్వహణ చాలెంజింగ్‌గా ఉంటుందన్నారు. ఈసారి జాతరకు కోటి యాభై లక్షల మందికి పైగా హాజరయ్యే అవకాశం ఉందన్నారు. సుమారు 5 లక్షల వాహనాలు వచ్చే అవకాశం ఉందని, దీనికి అనుగుణంగా పార్కింగ్ స్థలాలను పెంచామన్నారు. క్రమ పద్ధతిలో వాహనాలను మళ్లించి పార్కింగ్ స్థలాలను పూర్తిగా వినియోగించుకుంటే ట్రాఫిక్ జామ్ ఏర్పడదన్నారు. ట్రాఫిక్ క్లియరెన్స్‌లో భాగంగా వందకు పైగా ద్విచక్రవాహనాలను ఏర్పాటు చేస్తున్నామని, ఎక్కడైనా రోడ్డు ప్రమాదం జరిగితే అంబులెన్స్ లేదా పోలీసు వాహనాలలో క్షతగాత్రులను వెంటనే ఆస్పత్రికి తరలించాలన్నారు. లేనిపక్షంలో రోడ్డుపై ట్రాఫిక్ రద్దీకి అవకాశం ఉంటుందని వివరించారు. ట్రాఫిక్, పార్కింగ్ స్థలాలు, గద్దెల వద్ద పుషింగ్ పార్టీల పాత్ర కీలకమన్నారు. క్యూలైన్ వద్ద భక్తులు ఎక్కువ సేపు వేచి ఉండకుండా త్వరగా కదిలేలా పుషింగ్ పార్టీలను నియమించామన్నారు. మేడారం మొత్తం 500 సీసీ కెమెరాల నిఘా నేత్రంలో ఉంటుందని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పకడ్బందీ చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఎస్పీ శబరీశ్ మాట్లాడుతూ మహాలక్ష్మి పథకం అమలులో ఉన్న నేపథ్యంలో మహిళా భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో మహిళల వద్ద ఉన్న విలువైన వస్తువులు చోరీకి గురయ్యే అవకాశం ఉందన్నారు. అందుకే 500 మంది సీసీఎస్, స్పెషల్ బ్రాంచ్ సిబ్బందిని కేటాయించామన్నారు. డ్యూటీ ప్రదేశం వద్ద ఇతర శాఖల అధికారుల తో సమన్వయంతో పని చేయాలని కోరారు. జాతరలో పోలీస్ శాఖ పాత్ర కీలకమన్నారు. జాతరను విజయవంతంగా నిర్వహించి పోలీస్ శాఖకు మరింత మంచి పేరును తీసుకురావాలని కోరారు. అనంతరం ఐజీ తరుణ్‌జోషి జాతరలోని పలు ప్రాంతంలో పర్యటించి ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్పీలు కోటిరెడ్డి, కిరణ్‌ఖారే ఖారే, ఓఎస్డీ అశోక్‌కుమార్, ఏఎస్పీ సంకీర్త్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



నియంత్రణకు చర్యలేవి?

● యథేచ్ఛగా కంక వనాల నరికివేత
● పట్టించుకోని అటవీ శాఖ అధికారులు
● వ్యాపారుల నుంచి సీ ఫీజు వసూలు


కంకవనం

ఎస్ఎస్ తాడ్వాయి : మేడారంలోని కంక వనాలకు విశిష్టత ఉంది. మేడారానికి ఆనుకొని ఉన్న అటవీ ప్రాంతంలో కంక వృక్షాలు అధికంగా ఉంటాయి. అయితే ఈ కంక వనాల సంరక్షణకు చర్యలు తీసుకోవాల్సిన అటవీ శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో వ్యాపార దుకాణాల నిర్మాణాలకు యథేచ్ఛగా నరుకుతున్నారు. రెండేళ్ల వరకు ఏపుగా పెరిగిన కంక వనాలు ప్రతి మహాజాతర సమయంలో నరికివేతకు గురై కనుమరుగు అవుతున్నాయి.

చర్యలు శూన్యం

మేడారం జాతర సందర్భంగా అటవీ సంరక్షణ, పర్యావరణ నివారణ చర్యల కోసం వందలాది మంది అటవీ శాఖ అధికారులు విధులు నిర్వర్తిస్తుంటారు. అధికారులు విధులు నిర్వహిస్తున్నా.. కంక వృక్షాలు నరికివేతకు గురవుతుండడం గమనార్హం. జాతర సందర్భంగా వివిధ రకాల వందలాది దుకాణాలు వెలుస్తుంటాయి. ఆయా వ్యాపారులు తాత్కాలిక నిర్మాణాల కోసం కంకవనాలను విచ్చలవిడిగా నరికేస్తున్నారు. మేడారంలో ఎక్కడ చూసిన కంక బొంగలతో వేసి గుడారాలే దర్శనమిస్తుండడం గమనార్హం. తాడ్వాయిలో ఆర్టీసీ బస్టాండ్‌లో ఏర్పాట్ల కోసం ఓ కాంట్రాక్టర్ టెండర్ పొందాడు. ఇతర ప్రాంతాల నుంచి బొంగులు కొనుగోలు చేసి తడకలతో గదులు నిర్మించాల్సి ఉండగా స్థానికంగా లభించే కంక బొంగులనే నరికి వినియోగించారు. ఇంత పెద్ద మొత్తంలో ఏర్పాట్లు చేస్తున్నా.. అటవీ శాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాగా, జాతరలో అటవీశాఖ ఆధ్వర్యంలో వ్యాపారుల కొనుగోలు కోసం కంక బొంగుల విక్రయాల కేంద్రాలను ఏర్పాటు చేశారు. పూర్తిగా ఎండిపోయిన బొంగులను మాత్రమే అటవీ శాఖ అధికారులు విక్రయిస్తున్నప్పటికీ కొందరు కాంట్రాక్టర్లు, వ్యాపారులు మాత్రం ఎదిగే దశలో ఉన్న పచ్చి కంక బొంగులను అక్రమంగా అటవీ ప్రాంతాల నుంచి నరికి ఉపయోగిస్తున్నారు. అయినప్పటికీ అటవీ శాఖ అధికారులు పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.

సీ ఫీజు వసూళ్లతో సరి

అటవీ శాఖ అధికారులు కంక బొంగుల నరికివేతను నియంత్రించాల్సి ఉండగా వ్యాపారులు, కాంట్రాక్టర్లు పనుల కోసం కంక బొంగులను నరికి దుకాణాలు, ఇతర ఏర్పాట్లు చేసుకున్న తర్వాత వాటిని గమనించి సీ ఫీజు వసూలు చేస్తున్నారు. దుకాణాల వారీగా ఒక్కొక్క షాపు నుంచి కనీసం రూ.3వేల నుంచి రూ.10వరకు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో వ్యాపారులు సీ ఫీజు వసూలుపై గగ్గోలు పెడుతున్నారు. జాతరలో వ్యాపారం చేస్తే నాలుగు రూపాయలు వచ్చేది దేవుడు ఎరుగుగాని ఇలా కంక బొంగులను వినియోగించుకున్నందుకు అటవీ శాఖ అధికారులు ఫీజుల పేరుతో వసూళ్లకు పాల్పడటం భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మతిస్థిమితం లేని మహిళపై దాడి

ఖిలా వరంగల్: చిన్నారులను ఎత్తుకెళ్లే మహిళ నీవే అంటూ ప్రజలు ఓ మతిస్థిమితం లేని మహిళపై దాడి చేశారు. ఈ విషయం తెలిసి పోలీసులు, స్థానిక కార్పొరేటర్ మరుపల్లి రవి చేరుకుని మహిళను కాపాడి కుటుంబ సభ్యులకు అప్పగించిన సంఘటన శుక్రవారం సాయంత్రం వరంగల్ ఉర్సు కరీమాబాద్ నానమియా తోటలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. కడిపికొండలోని ప్రభుత్వ క్వార్టర్స్‌లో నివసిస్తున్న మతిస్థిమితం లేని పొన్నం శ్రావణి శుక్రవారం సాయంత్రం ఉర్సు నానమియా తోటకు రాగా పిల్లలను ఎత్తుకుపోయే మహిళ అంటూ ఆమెను పట్టుకున్నారు. స్థానిక ప్రజలు ఎంత ప్రయత్నం చేసినా ఆమె నుంచి సమాధానం రాలేదు. దీంతో ఆగ్రహానికి లోనైన స్థానిక ప్రజలు మతిస్థిమితి లేని శ్రావణిని చితక్కొట్టారు. ఈ విషయం తెలిసి స్థానిక కార్పొరేటర్ రవి, మిల్స్‌కాలనీ ఎస్సై వెంకన్న ఘటన స్థలానికి చేరుకుని మతిస్థిమితి లేని మహిళను కాపాడి నాయుడు పెట్రోల్‌బంక్ సమీప కాలనీలోని తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. కార్పొరేటర్, ఎస్సై మహిళను కాపాడిన సందర్భంగా చిలివేరు శ్రీను, కంకల శంకర్, చింతపట్ల ప్రశాంత్ అభినందించారు.

14న గట్టమ్మ ఎదురు పిల్ల పండుగ


లక్ష్మీదేవరలకు ఆహ్వానం పలుకుతున్న గట్టమ్మ పూజారులు

ములుగు రూరల్ : మేడారం మహాజాతర సందర్భంగా ఆదిదేవత గట్టమ్మ తల్లికి నిర్వహిస్తున్న ఎదురుపిల్ల పండుగకు ఆదివాసీ ఇష్టదైవాలు లక్ష్మీదేవరలను గట్టమ్మ పూజారులు ఆహ్వానించారు. ఈ మేరకు శుక్రవారం ఆదివాసీ నాయకపోడ్ సంఘం జిల్లా అధ్యక్షుడు కొత్త సురేందర్ ఆధ్వర్యంలో పూజారులు ఆహ్వాన పత్రికలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 14వ తేదీన గట్టమ్మ తల్లి ఎదురుపిల్ల పండుగ నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా ఆదివాసీ నాయకపోడ్‌లు నైవేద్యాలతో(బోనాలతో) జిల్లా కేంద్రంలోని డీఎల్ఆర్ ఫంక్షన్ హాల్ నుంచి గట్టమ్మ ఆలయం వరకు భారీ ర్యాలీ నిర్వహిస్తామన్నారు. ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలకు అనుగుణంగా ఎదురుపిల్ల పండుగ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో పూజారులు కొత్త సదయ్య, లక్ష్మయ్య, ఆకుల మొగిలి, సమ్మయ్య, రాజు, రమేష్ పాల్గొన్నారు.

మేడారంలో దుకాణాల తొలగింపు


జేసీబీతో తొలగించడంతో పగిలిన రేకులు

ఎస్ఎస్ తాడ్వాయి : మేడారంలోని ఐలండ్ ప్రదేశంలో రోడ్లకు ఇరువైపులా ఏర్పాటు చేసిన దుకాణాలను జీపీ అధికారులు శుక్రవారం తొలగించారు. మేడారం జాతరకు ఇంకా పది రోజుల సమయం ఉన్నా ఇప్పటి నుంచే భక్తుల తాకిడి భారీగా పెరుగుతోంది. ఐలండ్ ప్రాంతంలో రోడ్లకు ఇరువైపులా దుకాణాలు ఏర్పాటు చేయడంతో రాకపోకలు సాగిస్తున్న భక్తులకు ఇబ్బందికరంగా మరుతుంది. దీంతో గ్రామ పంచాయతీ అధికారులు దుకాణాలను తొలగించాలని వ్యాపారులకు ముందస్తు సమాచారం అందించారు. ఈ మేరకు వ్యాపారులు స్పందించకపోవడంతో అధికారులే దగ్గరుండి దుకాణాల తొలగింపు చేపట్టారు. కాగా, జాతరకు పది రోజుల సమయం ఉన్నా ఇప్పుడే దుకాణాలను తొలగించడం సరికాదని వ్యాపారులు వాపోయారు. జిల్లా ఉన్నతాధికారులతో మాట్లాడుతుండగానే దుకాణాలను తొలగించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తామే దుకాణాలు తొలగిస్తామని చెప్పినా పట్టించుకోకుండా రేకులు ధ్వంసం చేశారని, తమకు న్యాయం చేయాలని బాధిత వ్యాపారులు అధికారులను కోరారు.

కూల్ డ్రింక్స్.. హాట్ రేట్స్..


డీలర్లు డంప్ చేసుకున్న కూల్ డ్రింక్స్

ఎస్ఎస్ తాడ్వాయి : మేడారం జాతరలో కూల్ డ్రింక్స్ ధరలు మండుతున్నాయి. మేడారంలో వందల సంఖ్యలో ఏర్పాటు చేసిన దుకాణాలకు సంబంధిత థమ్స్ అప్ డీలర్లు కూల్ డింక్స్, వాటర్ బాటిళ్లను ఎమ్మార్పీకి కంటే అధిక ధరలకు సప్లయ్ చేస్తున్నారు. రూ.20 నుంచి రూ.50 వేల వరకు స్టాక్ వ్యాపారులకు ఫ్రిడ్జ్‌లు అందించి ఒక బాటిల్‌కు ఎమ్మార్పీ కంటే రూ. 10 నుంచి రూ.20 వరకు అదనంగా సప్లయ్ చేస్తున్నారు. దీంతో వ్యాపారులు భక్తులకు కూలింగ్, తదితర మెయింటెన్స్ చార్జీలు కలిపి మరో రూ.30 నుంచి రూ.50 వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. దీంతో జాతర వచ్చే భక్తులు వాటర్ బాటిల్, కూల్ డ్రింక్స్ కొనుగోలు చేయాలంటే జంకుతున్నారు.

తోరణానికి మరమ్మతులు చేయాలి


పస్రాలోని సమ్మక్క సారలమ్మ తోరణం

గోవిందరావుపేట: ప్రభుత్వం మేడారం జాతరకు కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నా అధికారులు మాత్రం పస్రా చౌరస్తాలో 163 జాతీయ రహదారిపై ఉన్న శ్రీసమ్మక్క, సారలమ్మ మేడారం జాతర తోరణానికి మరమ్మతులు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని మహాజన సోషలిస్ట్ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షుడు మడిపల్లి శ్యాంబాబు అన్నారు. జాతర సమీపిస్తున్నా తోరణానికి పెయింటింగ్ వేయడంతోపాటు మరమ్మతులు చేపట్టడం లేదని మండిపడ్డారు. తాడ్వాయి తోరణానికి మరమ్మతులు చేసి పెయింటింగ్ వేసిన అధికారులు.. పస్రాలో ఉన్న తోరణాన్ని మాత్రం నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. దీనిపై ఇప్పటికైనా స్పందించి పస్రా తోరణానికి పెయింటింగ్ వేయడంతోపాటు మరమ్మతులు చేయాలని కోరారు.

దాడి ఘటనలో దంపతులకు జైలు

● ఒక్కొక్కరికి రూ. వెయ్యి జరిమానా

మరిపెడ రూరల్ : ఓ వ్యక్తిపై దాడికి పాల్పడిన ఘటనలో మండలంలోని సోమ్లతండా గ్రామానికి చెందిన దంపతులకు తొర్రూరు జూనియర్ సివిల్ జడ్జి మట్ట సరిత ఏడాది జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.వెయ్యి జరిమానా విధించినట్లు మరిపెడ ఎస్సై తాహేర్‌బాబా శుక్రవారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. 2014 సంవత్సరంలో సోమ్లతండాలో ఇంటికి వెళ్లే రోడ్డులో దంపతులు అజ్మీరా మంగ్యా, సుజాత ముళ్ల కంచె వేశారు. దీంతో అదే తండాకు చెందిన అజ్మీరా బాలాజీ వారిని కంచె ఎందుకు వేశారని ప్రశ్నించాడు. దీంతో ఆగ్రహం చెందిన దంపతులు.. బాలాజీపై దాడికి పాల్పడ్డారు. దీంతో బాలాజీ మరిపెడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు అప్పటి ఎస్సై ఎస్. నాగభూషణం కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కోర్టులో సాక్ష్యాధారాలు ప్రవేశపెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ డి.గణేష్ ఆనంద్ వాదించారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన తొర్రూరు జూనియర్ సివిల్ జడ్జి మట్ట సరిత.. మంగ్యా, సుజాత దంపతులకు ఏడాది జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ. వెయ్యి జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. ఈ సందర్భంగా కోర్టు కానిస్టేబుల్ రామ్‌నారాయణను తొర్రూరు డీఎస్పీ వెంకటేశ్వరబాబు, సీఐ లావుడ్య రాజు, ఎస్సై తాహేర్‌బాబా అభినందించారు.

పీవీకి భారతరత్న పురస్కారంపై హర్షం

దివంగత మాజీ ప్రధాని పీవీ నర్సింహారావుకు 'భారతరత్న' పురస్కారం రావడం హర్షణీయమని ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ప్రముఖులు అన్నారు. శుక్రవారం కేంద్ర ప్రభుత్వం దివంగత మాజీ ప్రధాని నరసింహారావుకు 'భారతరత్న' పురస్కారం ప్రకటించిన విషయం విధితమే. దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లా వాసులు హర్షం వ్యక్తం చేస్తూ టపాసులు కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు.

–సాక్షి నెట్‌వర్క్

గర్వించదగ్గ విషయం



మాజీ ప్రధాని పీవీ.నరసింహారావుకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న అవార్డు ప్రకటించడం గర్వించదగ్గ విషయం. పీవీ అపర మేధావి. ఆయనకు భారతరత్న ఇవ్వాలని తొలిసారిగా అసెంబ్లీలో అప్పటి సీఎం కేసీఆర్ నాయకత్వంలో తీర్మానం చేశారు. ఎమ్మెల్యేగా బలపరిచే అవకాశం నాకు దక్కింది.

- పెద్ది సుదర్శన్‌రెడ్డి, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే

పీవీ.. దేశానికి లివీ..



మాజీ ప్రధాని, తెలంగాణ ముద్దు బిడ్డ పీవీ నరసింహారావుకు భారతరత్న అవార్డు ప్రకటించడం హర్షణీయం. పీవీ దేశానికి లీవీగా నిలిచారు. పీవీ ఆర్థిక సంస్కరణలే దేశ ప్రగతికి పునాదులు. పీవీ నీతి, నిజాయితీ గల నాయకుడు. ఆయనను ఆదర్శంగా తీసుకుని పాలకుర్తి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నిలుపుతా.

- మామిడాల యశస్వినిరెడ్డి, ఎమ్మెల్యే పాలకుర్తి

అందరికీ ఆదర్శనీయం



మాజీ ప్రధాని, బహుముఖ ప్రజ్ఞాశాలి, తెలంగాణ ఖ్యాతిని ఖండాంతరాలకు చాటిన మేధావి దివంగత పీవీ నరసింహారావును భారతరత్న వరించడం యావత్ తెలంగాణ గర్వించదగిన విషయం. రాజకీయ వేత్తగా, భారతదేశానికి వివిధ హోదాల్లో విస్తృతంగా సేవలందించిన పీవీ నరసింహారావు ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యక్తి కావడం మన అదృష్టం. స్వరాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీ పీవీ నరసింహారావు జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహించి ఏడాది పాటు శత జయంతి ఉత్సవాలను నిర్వహించింది. పీవీ ఎదిగిన తీరు అందరికీ ఆదర్శనీయం.. స్ఫూర్తిదాయకం.

-సత్యవతి రాథోడ్, ఎమ్మెల్సీ, మాజీ మంత్రి

వేర్వేరు కారణాలతో ముగ్గురి మృతి

వేర్వేరు కారణాలతో శుక్రవారం ఉమ్మడి వరంగల్ జిల్లాలో ముగ్గురు మృతి చెందారు. దీంతో ఆయా కుటుంబాల్లో విషాదం నెలకొంది.


కవిత (ఫైల్)

నల్లబెల్లి : విద్యుతాఘాతంతో ఓ మహిళ మృతి చెందింది. ఈ ఘటన మండలంలోని గోవిందాపూర్ శివారు వేదనగర్‌లో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బైకాని కవిత(35), రాజు దంపతులు వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. శుక్రవారం ఉదయం తమ పొలానికి పురుగుమందు పిచికారీ చేసేందుకు ఇంట్లో ఉన్న చార్జింగ్ పంపును ప్లగ్ నుంచి తీస్తున్న క్రమంలో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలికి కూతురు, కుమారుడు ఉన్నారు. ఈ ఘటనపై రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నైనాల నగేష్ తెలిపారు.

చికిత్స పొందుతున్న హెడ్‌కానిస్టేబుల్..

ఖిలా వరంగల్: పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన టీఎస్ఎస్పీ నాలుగో బెటాలియన్ హెడ్ కానిస్టేబుల్ ఎంజీఎంలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఐనవోలు మండల కేంద్రానికి చెందిన వంగాల సంపత్‌కుమార్ మామునూరు టీఎస్ఎస్పీ నాలుగో బెటాలియన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులు ఎక్కువ కావడంతో మనస్తాపం చెందుతున్నాడు. ఈ క్రమంలో ఈనెల 1వ తేదీన పురుగుల మందుతాగి అపస్మారక స్థితిలో ఉండగా స్థానికులు గమనించి 108లో ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య సరిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ మల్లయ్య తెలిపారు.

భూపాలపల్లిలో రోడ్డు ప్రమాదంలో వ్యక్తి..

భూపాలపల్లి అర్బన్: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన భూపాలపల్లి పట్టణంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మహదేవపూర్ మండలం కన్నెపల్లికి చెందిన పట్టల సారయ్య(45) తన భార్య రజిత అనారోగ్యానికి గురికావడంతో శుక్రవారం మధ్యాహ్నం పట్టణంలోని సురక్ష ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకొచ్చాడు. పనినిమిత్తం అదే రోజు రాత్రి రోడ్డుపై నుంచి నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఈ క్రమంలో కాళేశ్వరం నుంచి వరంగల్ వైపునకు వెళ్తున్న ఇసుక లారీ వెనుక నుంచి ఢీకొనడంతో సారయ్యను అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి కూతురు, కుమారుడు ఉన్నారు.

గృహజ్యోతి సర్వే తనిఖీ


సిబ్బందితో మాట్లాడుతున్న ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి

దుగ్గొండి: 'గృహజ్యోతి'లో భాగంగా 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకం లబ్ధిదారుల ఎంపిక కోసం విద్యుత్ శాఖ అధికారులు శుక్రవారం ఇంటింటి సర్వే చేపట్టారు. ఈ సర్వే తీరును ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి.. గిర్నిబావిలో తనిఖీ చేశారు. స్వయంగా ఓ ఇంటి వద్దకు వెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన అధికారులతో మాట్లాడారు. ఉచిత విద్యుత్ కోసం ఇంటి సర్వీస్ నంబర్‌ను యజమాని ఆధార్ కార్డు, ఫోన్‌నంబర్, రేషన్‌కార్డు నంబర్‌లతో లింక్ చేయాలన్నారు. వినియోగదారులు అధికారులకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఏడీఈ లక్ష్మణ్, ఇన్‌చార్జ్ ఏఈ రామకృష్ణ, లైన్ ఇన్‌స్పెక్టర్ అహ్మద్ పాషా, రాజు, అజయ్, సిబ్బంది పాల్గొన్నారు.

నకిలీ సర్టిఫికెట్ల తయారీ ముఠా అరెస్టు


దాడిలో పాల్గొన్న టాస్క్‌ఫోర్స్ అధికారులు, సిబ్బంది

వరంగల్ క్రైం /ఖిలావరంగల్ : వరంగల్ కమిషనరేట్ పరిధిలోని ఆర్‌టీఓ కార్యాలయాల ఎదుట షాపులు ఏర్పాటు చేసుకుని ఫిజికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల తయారీ కోసం ఒక్కొక్కరి నుంచి రూ.500 తీసుకుంటూ నకిలీ సర్టిఫికెట్లు తయారు చేస్తున్న ముఠాను అరెస్టు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. వరంగల్ ఆర్‌టీఓ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన షాపుల్లో టాస్క్‌ఫోర్స్ పోలీసులు శుక్రవారం దాడులు నిర్వహించి గొడుగు ప్రభాకర్, గొడిశాల ప్రకాశం, ఠాకూర్ మోతీసింగ్, చెల్ల నర్సింహస్వామిని పట్టుకున్నారు. అనంతరం వారి నుంచి డాక్టర్ స్టాంప్‌లు, స్టాంప్ ప్యాడ్‌లు, సర్టిఫికెట్లు స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ తెలిపారు. కార్యక్రమంలో టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ అల్లం రాంబాబు, ఎస్సై శరత్, హెడ్ కానిస్టేబుల్ అశోక్, కానిస్టేబుళ్లు సత్యనారాయణ, నరేష్, సాంబరాజు, రఘు, తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్‌షాపుపై టాస్క్‌ఫోర్స్ దాడులు


స్వాధీనం చేసుకున్న మద్యంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు

నెక్కొండ : బెల్ట్‌షాపుపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించిన ఘటన శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పరిధిలో చోటుచేసుకుంది. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపిన వివరాల ప్రకారం.. నెక్కొండ మండలం పెద్దకొర్పోలు గ్రామంలోని బెల్ట్‌షాపులో మద్యం విక్రయిస్తున్నారని పక్కా సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ సిబ్బంది కోరండ్ల లక్ష్మణ్.. బెల్ట్‌షాపుపై దాడి చేశారు. ఇందులో రూ. 10,760 వేల విలువైన మద్యం స్వాధీనం చేసుకున్నామని ఏసీపీ తెలిపారు. మద్యంతో పాటు నిందితుడిని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు వివరించారు. దాడుల్లో టాస్క్‌ఫోర్స్ సీఐ అల్లం రాంబాబు, ఎస్సై బి శరత్, సిబ్బంది పాల్గొన్నారు.